క్లుప్తంగా

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి


సైదులుకు వినతిపత్రం ఇస్తున్న హెచ్‌ఎంలు

ఖమ్మం సహకారనగర్: ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు బదిలీలు చేపట్టాక పదోన్నతులు కల్పించాలని పలువురు పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులుకు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు పిల్లలమర్రి శివ నర్సింహారావు, శేషయ్య, శ్రీలత తదితరులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. మొదటిసారిగా మల్టీ జోన్ వ్యవస్థ విద్యాశాఖలో అమలవుతున్న క్రమాన బదిలీలు చేయకుండా పదోన్నతులు ఇస్తారనే ప్రచారం జరుగుతుందని, దాని వల్ల తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. బదిలీలు చేసిన తర్వాతే పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అఫ్జార్ బేగం, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్‌కు స్పందించొద్దు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ పేరుపై కొందరు ఫేక్ కాల్స్ చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, ఈ కాల్స్‌కు ఎవరూ స్పందించవద్దని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కొన్ని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రులకు, ఇతర వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సు ఫీజులు చెల్లించాలని 93464 23925 నెంబర్ నుంచి కాల్స్ వచ్చాయని, ఈ నంబర్ ట్రూ కాలర్‌లో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అనుదీప్ పేరుతో వచ్చినట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ నంబర్‌తో కేఎంసీ అధికారులమని ఎవరికైనా కాల్స్ వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

సీపీఐ మండల కార్యదర్శిగా వెంకటేశ్వరరావు


మారిశెట్టి వెంకటేశ్వరరావు

నేలకొండపల్లి: సీపీఐ మండల ప్రధాన కార్యదర్శిగా మారిశెట్టి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మోటాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన 17వ మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా మల్లెబోయిన ఉపేందర్, మాలోత్ అయోధ్యలతో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులు, 23 మంది కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కమిటీ పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించింది.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన జిల్లా నూతన కమిటీ సభ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలోని జిల్లా పాఠశాలల క్రీడల సంఘం కార్యాలయంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పీ.వీ.రమణ, కార్యదర్శిగా ఎండీ షఫీక్, కోశాధికారిగా జి.సైదేశ్వరరావు, కార్య నిర్వాహక కార్యదర్శిగా ఎస్‌కె.నాగుల్ మీరా, జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఇ.భాగ్యమ్మ, వై.రామారావులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇందులో రాష్ట్ర వాయ్యామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి కె. కృష్ణమూర్తి, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించగా..జిల్లాలోని 80మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్



కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	56	చుక్కకూర	3
బీర	40		20
దొండ	34	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	50	గోంగూర	4
గోరుచిక్కుడు	40		20
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	36		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	76		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

గుట్ట.. ఎక్కేదెట్టా?


రాళ్లుతేలి ప్రమాదకరంగా మారిన రోడ్డు


జీళ్లచెరువులోని ఆలయం

ప్రమాదకరంగా జీళ్లచెరువు ఆలయ రహదారి
- మధ్యలోనే నిలిచిన విస్తరణ పనులు
- వాహనాల రాకపోకలకు నరకయాతన
- రోడ్డు త్వరగా నిర్మించాలని భక్తుల వేడుకోలు

కూసుమంచి: జీళ్లచెరువులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం గుట్టపైకి ఘాట్ రోడ్డులో వెళ్లేందుకు భక్తులు నరకయాతన పడుతున్నారు. గతంలో గ్రావెల్‌గా ఉన్న రోడ్డును రెండు వరసల రహదారిగా విస్తరించి బీటీ రోడ్డుగా మార్చేందుకు 2023లో పనులను చేపట్టారు. నాడు పాలేరు ఎమ్మెల్యేగా ఉన్న కందాల ఉపేందర్‌రెడ్డి సొంతంగా నిర్మిస్తానని ఇచ్చిన హామీలో భాగంగా ఈ పనులు మొదలుపెట్టారు. దీంతో ఖమ్మం–సూర్యాపేట రహదారి నుంచి గుట్టపైకి వరకు ఉన్న పాత రోడ్డును వెడల్పు చేసి మట్టితో నింపారు. ఈ సమయాన అసెంబ్లీ ఎన్నికలు రావడం కందాల ఉపేందర్‌రెడ్డి ఓడిపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఆ తర్వాత ఈ సమస్యను ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి స్థానిక నాయకులు, భక్తులు తీసుకురాగా రూ.2 కోట్ల మేర నిధులు మంజూరు చేయించారు. కానీ నేటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కాగా, ఈ పనుల కోసం టెండర్లు పిలిచినట్లు అధికారులు చెబుతున్నారు.

ఈ దారే శరణ్యం..

ఆలయానికి ప్రతీ శనివారంతో పాటు పండగల సమయాల్లో వచ్చే భక్తులకు ఘాట్‌రోడ్డు సరిగా లేకపోవడంతో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఘాట్ రోడ్డు గుండా ఆలయం వద్దకు వస్తుండగా.. మెట్లు ఎక్కలేని భక్తులకు ఈ దారే శరణ్యమైంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా మంత్రి దృష్టి సారించి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని భక్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు..

ఆలయానికి మెట్ల మార్గం ఉన్నా.. వాహనాలు వెళ్లేందుకు ఉన్న ఘాట్‌రోడ్డు ప్రమాదకరంగా మారింది. కిలోమీటరు మేర గుట్టపైకి ఈ దారిగుండా వెళ్లాలంటే వాహనదారులు వణికిపోతున్నారు. విస్తరణలో భాగంగా రహదారికి మట్టిని పోసి వదిలివేయడంతో వర్షాలకు ఆ మట్టి కొట్టుకుపోయి నెర్రెలువాలింది. రాళ్లు తేలి అక్కడక్కడ గుంతలు పడ్డాయి. ఈక్రమంలో నిటారుగా ఈ రహదారి గుండా వాహనాలు గుట్టపైకి ఎక్కించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. అలాగే గుట్ట నుంచి కిందికి దిగే ముందు బాగా డౌన్ ఉండడంతో వాహనాలను కంట్రోల్ చేయడం చాలా కష్టంగా మారింది. రహదారి సరిగా ఉంటేనే వాహనాలు నడపడం ఇబ్బంది కాగా ఇలా ప్రమాదకరంగా ఉండడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వస్తున్నారు.


అష్టకష్టాలతో గుట్టపైకి వస్తున్న వాహనదారుడు

భక్తులకు ఇబ్బందిగా ఉంది..

ఆలయంపైకి వచ్చే ఘాట్‌రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో వాహనాలు గుట్టపైకి రావాలంటే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో రోడ్డు కొట్టుకుపోయే అవకాశం ఉంది. మంత్రి, అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేయించాలి.

– స్వామినాథ్, ఆలయ అర్చకుడు

భయంగా గుట్టపైకి వచ్చా..

జీళ్లచెరువు ఆలయానికి దర్శనం కోసం వచ్చాను. గుట్టపైకి వచ్చే దారి గుంతలు రాళ్లతో ప్రమాదంగా ఉంది. బైక్‌ను గుట్టపైకి ఎక్కించాలంటే ఎంతో భయ పడ్డాను. అతి కష్టం మీద వెళ్లాల్సి వచ్చింది. రోడ్డు బాగు చేయించాలి.

– రమేష్, భక్తుడు, ఖమ్మం

కోలుకోలేని స్థితిలోకి విద్యారంగం..


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం కోలుకోలేని స్థితిలోకి వెళ్తుందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యా రంగం పట్ల గత ప్రభుత్వం చూపిన తరహాలోనే ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించపోవడం సిగ్గుచేటన్నారు. ఖమ్మం కేంద్రంగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటులోనూ, జిల్లాకు జేఎన్‌టీయూ సబ్ క్యాంపస్ కళాశాల భవనాలను నిర్మించడంలో అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. దీనిపై జులై 28న పీడీఎస్‌యూ జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్న నేపథ్యాన ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు వినయ్, పృథ్వి, సందీప్, ప్రసాద్, అశోక్, స్టాలిన్, నరేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో పీఎస్‌ఆర్ యూత్ ఆధ్వర్యాన జరిగిన క్రికెట్ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆదివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహానికి, మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. మొదటి విజేతకు రూ.25వేలు, రెండో బహుమతిగా రూ. 15వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, భూక్యా సురేష్‌నాయక్, రామయ్య, మద్ది వీరారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పంతులు, కిరణ్, శేఖర్, సతీష్, నవీన్, మహేష్ కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

రఘునాథపాలెం: రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద మంజూరైన నిధులు, కొత్త రేషన్ కార్డులు మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు కోయచలక గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన రైతులు పాలాభిషేకం చేశారు. రైతుల ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకుని సీఎం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రగతిశీలంగా ఉన్నాయని నాయకులు పేర్కొన్నారు. మాజీ గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి పూర్ణ, మాధంశెట్టి హనుమంతురావు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

నేలకొండపల్లి: మోటాపురం–జీళ్లచెరువు రహదారి నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.4.40కోట్లు మంజూరు చేయించగా.. పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈనేపథ్యాన ఆదివారం మండలంలోని మోటాపురం వద్ద జరుగుతున్న పనులను కాంగ్రెస్ నాయకులు కాంట్రాక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింక్ రోడ్డు నిర్మాణంతో రైతుల కష్టాలు తీరనున్నాయన్నారు. నాయకులు బెల్లం శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, కృష్ణారావు, లక్ష్మణ్, చంటి, కృష్ణమూర్తి, సాహిత్, నెహ్రూ, మురళి, చావా వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

వ్యర్థాలు.. అనర్థాలు!


నాడు వరదలతో కొట్టుకుపోయిన రోడ్డు


నేడు గ్రానైట్ వ్యర్థాలు పోసిన దృశ్యం

గతేదాది మండలంలోని కొక్కిరేణి ఎర్రగడ్డ గ్రామాల మధ్య భారీ వర్షాలు వరదలతో రహదారి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. అయితే ఆ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో కొందరు టిప్పర్ల యజమానులు ఏకంగా గ్రానైట్ వ్యర్థాలను ఆప్రాంతంలో పోసి మరింత ప్రమాదకర పరిస్థితులను తీసుకొచ్చారు. రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు రాత్రి సమయాన ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– తిరుమలాయపాలెం

ఆవిష్కరణలు..

- **ఉద్యమకారుల దీక్ష కరపత్రాలు**


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

ఖమ్మం మామిళ్లగూడెం: జులై 3, 4, 5వ తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల ప్రాంగణం ఉస్మానియా క్యాంపస్‌లో జరిగే ఉద్యమకారుల దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు పాలకుర్తి కృష్ణ కోరారు. ఆదివారం ఈ దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామా అంజిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి,మలి దశల్లో ఎన్నో బలిదానాలు జరిగాయన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరకపల్లి ఎల్లయ్య, కొండల్‌రావు, ఉదయ్, రాజేందర్, చౌహాన్, మురళి, నాగేశ్వరరావు, రాజేష్, నాగరాజు, శ్రీను, యాకయ్య, రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- **బీఆర్‌ఎస్ నాయకుడి విగ్రహం..**


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో బీఆర్‌ఎస్ నాయకుడు బండారు వీరబాబు తండ్రి వెంకయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వెంకయ్య విగ్రహాన్ని ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, నాయకులు వున్నం బ్రహ్మయ్య, ఇంటూరి శేఖర్, నాగుబండి శ్రీనివాసరావు, వేముల వీరయ్య, అనగాని నరసింహారావు, కోటి సైదారెడ్డి, సంపత్, కమదన ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- **పోస్టర్లు..**

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 25 నుంచి జులై 26 వరకు దేశవ్యాప్తంగా 10 లక్షల మొక్కలు నాటేలా చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన పర్యావరణ ఉద్యమాన్ని ప్రారంభించినట్లు జమాతే ఇస్లామీ హింద్ ఖమం జిల్లా మహిళా అధ్యక్షురాలు అస్మా అన్జుమ్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని జమాతే ఇస్లామీ హింద్ స్థానిక కార్యాలయంలో పిల్లలతో కలిసి ఉద్యమ లోగోతో పాటు పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'చేతులు మట్టిలో, హృదయం భారతదేశంతో' అనే పేరుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం పిల్లల బాల్యంలోనే ప్రకృతిపై ప్రేమ, బాధ్యత వంటి విలువలు అలవర్చుతాయన్నారు. మొక్కలు నాటడం ద్వారా పిల్లల్లో దేశభక్తి, పర్యావరణ భద్రత, సేవా భావం పెరుగుతాయని పేర్కొన్నారు.

జయప్రదం చేయండి

➡ విద్యాసంస్థల బంద్‌ను..


సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే నెల 2, 3, 4వ తేదీల్లో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు ఇరప రాజేష్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ కోరారు. ఆదివారం ఖమ్మం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయలేదన్నారు. దీనివల్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, వాటి మీదనే ఆధారపడిన చిన్నస్థాయి కళాశాలలు మూసివేయబడి వాటి స్థానాల్లో నాన్ దోస్త్ కాలేజీల పేరిట కార్పొరేట్ కాలేజీలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే జూనియర్ కళాశాలలో కార్పొరేట్లమయమయ్యాయని, ఇక డిగ్రీ కాలేజీలు కూడా వారి చేతిల్లోకి వెళ్తే పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చందు, జిల్లా కమిటీ సభ్యులు సాగర్, నాయకులు శిరీష, గాంధీ, ఉదయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

➡ భవన నిర్మాణ కార్మిక మహాసభను..

ఖమ్మం మామిళ్లగూడెం: జులై 1న ఖమ్మంలో జరిగే తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా మూడో మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గోస్ పుల్లయ్య కోరారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పేరబోయిన వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 60ఏళ్లు దాటిన కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ద్వారా లభించే పథకాలకు డబ్బులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పి.నరసింహారావు, కోటేశ్వరరావు, ప్రభాకర్, బి.వీరభద్రం, సురేష్, గొడుగు విజయ్, ఎన్.వెంకట్, నర్సయ్య, ఎస్.లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

➡ సార్వత్రిక సమ్మెను..


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ బషీరుద్దీన్

తిరుమలాయపాలెం: జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం తిరుమలాయపాలెంలోని గజ్జల వెంకటయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, విద్యా, వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. అటవీ హక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలనే అంశంతో 18 రకాల డిమాండ్లతో ఈ సమ్మె జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు తుల్లూరి నాగేశ్వరరావు, వేగినాటి మంగతాయమ్మ, వీరన్న, గురువులు, కోడి లింగయ్య, యశోద, దొడ్డ లింగస్వామి, కొమ్ము నాగేశ్వరరావు, సైదులు, రాజశేఖర్, బాబు, ప్రసాద్, గాదె వరుణ్, ఉమేష్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ సామాజిక సేవకుడు సీతారాం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఓల్గా తదితరులు

ఖమ్మంసహకారనగర్: ప్రపంచ సాహిత్యాన్ని తన రచనల ద్వారా సమాజంపై ప్రభావం చూపిన వ్యక్తి, బహుముఖ సామాజిక సేవకుడు అని రచయిత్రి ఓల్గా పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సెలబ్రేషన్ ఆఫ్ టీచింగ్ పేరిట మిత్రుల ఆధ్వర్యాన జరిగిన 'కనుక'కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థుల చేత రాయించిన రచనల ప్రదర్శన ప్రదర్శించగా.. 'తొలికథ'పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వక్తలు విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసిస్తూ మాట్లాడారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. సీతారాం లాంటి మిత్రుడు జీవితంలో ఉంటే ఎంతో సామాజిక చైతన్యం, బాధ్యతలు నేర్చుకోవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త రవిమారుత్, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులు ప్రసేన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.నీరజ, ఐవీ రమణారావు, కె.ఎస్.రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్, అధ్యాపకులు, సాహిత్యాభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకతకు పాతర..



ఈ-ఆఫీస్ లేకుండానే ఫైళ్లు..
- కేఎంసీలో డిజిటల్ కీలు తీసుకోని అధికారులు
- పేపర్ ఫైళ్లతోనే పనులు పూర్తి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో ఈ–ఆఫీస్ విధానం నిలిచిపోవడంతో పాలనా వ్యవహారాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిజిటల్ పారదర్శకత, వేగవంతమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ–ఆఫీస్ వ్యవస్థను కొందరు అధికారులు విస్మరించడం గమనార్హం. ఫైళ్లను ఆన్‌లైన్‌లో పెట్టడం, పరిశీలించడం వంటి పనులను కొన్ని విభాగాల అధికారులు పూర్తిగా మానేసినట్లు తెలుస్తోంది. కొందరు కనీసం తమకు మంజూరయ్యే డిజిటల్ కీని కూడా తీసుకోకపోవడం గమనార్హం. అన్ని విభాగాలను సమన్వయం చేయడంతో పాటు నగర సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే కమిషనర్ ఈ ఆఫీస్‌ను పరిశీలించడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా పౌర సేవలను అందించేందుకు మూడు, నాలుగు కీలు వాడుతున్నారు. అయితే ఆ కిందిస్థాయి అధికారులు ఈ ఆఫీసును వినియోగించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

డిజిటల్ కీలకు దూరంగా..

కేఎంసీ కార్యాలయంలో ప్రతీ ఫైల్‌ను ఈ–ఆఫీసులో ఉంచేందుకు ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్, టౌన్‌ప్లానింగ్, అకౌంట్స్, ఆడిట్, బర్త్ అండ్ డెత్ తదితర విభాగాల అధికారులకు డిజిటల్ కీలను మంజూరు చేస్తారు. గతంలో ప్రతీ విభాగం ఉన్నతాధికారితో పాటు ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్ చూసే వారికి ఈ కీలు ఉండేవి. కాని ఇప్పుడు ఇంజనీరింగ్ విభాగంతో పాటు శానిటేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాలకు సంబంధించి కీలను తీసుకోవడం లేదని తెలుస్తోంది. కార్మికుల పీఎఫ్‌కు సంబంధించిన లాగిన్ తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ–ఆఫీసు లేకుండానే ఓ అధికారి ఆయా విభాగాల కార్యకలాపాలు చక్కబెట్టారని, ఇక శానిటేషన్‌కు సంబంధించిన బిల్లుల చెల్లింపులు ఓచర్ విధానంలో చేసినట్లు తెలుస్తోంది. దీనివల్ల ఫైళ్ల నిర్వహణ ఇష్టానుసారంగా జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ–ఆఫీస్ ద్వారా ప్రతీ కదలిక రికార్డు అవుతున్న తరుణాన జవాబుదారీతనం కొరవడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మరింత ఆలస్యం..

ప్రభుత్వ కార్యాలయాల్లో డిజిటల్ పారదర్శకతను పెంచడానికి, కాగిత రహిత పాలనకు ప్రోత్సహించడానికి ఈ–ఆఫీస్ వ్యవస్థను భారీగా ఖర్చుచేసి ఏర్పాటు చేశారు. అయితే దీన్ని వినియోగించకపోవడం వల్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న తీరు చూస్తుంటే ఈ–ఆఫీస్ వల్ల జరగాల్సిన పనులు కూడా మరింత ఆలస్యం కావడంతో పాటు అక్రమాలకు అవకాశం పెరుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఫైళ్ల గోప్యతకు భంగం..

ఈ–ఆఫీస్ ద్వారా ఫైళ్లు డిజిటల్‌గా భద్రపరచబడతాయి, ట్రాక్ చేయబడతాయి. కానీ ఇప్పుడు ఫైళ్లను మాన్యువల్‌గా నిర్వహించడం వల్ల వాటి భద్రత, గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ ఫైల్ ఎవరి వద్ద ఉంది, దాని స్థితి ఏమిటి అనే వివరాలు తెలుసుకోవడం కష్టతరంగా మారింది. ఈ–ఆఫీస్ వినియోగాన్ని పునరుద్ధరించాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలనే చర్చ కేఎంసీలో వినిపిస్తుంది.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎన్.ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 8184
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957